




మంగళగిరి బెటాలియన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



మోదీ సభకు
ఆర్టీసీ బస్సులు

- కర్నూలుకు 250 పైనే సర్వీసులు కేటాయింపు
- గుంటూరు నుంచి 180, బాపట్ల నుంచి 40 బస్సులు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0 సభకు కర్నూలుకు గురువారం విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు తరలివెళుతున్నాయి. జీఎస్టీ సంస్కరణల తర్వాత గురువారం కర్నూలులో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్న సభకు భారీగా జనసమీకరణ చేయనున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 250 పైనే ఆర్టీసీ సర్వీసులు తరలివెళ్లనున్నాయి. అదే సమయంలో సామాన్య ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాని సభకు సంబంధించి జనసమీ కరణకు కండీషన్‌లో ఉన్న బస్సులు సమకూర్చాలని ఉన్నతాధికారుల నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గుంటూరు- 1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి 180 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. అలానే బాపట్ల జిల్లా నుంచి 40 సర్వీసులు ప్రధాని సభకు తరలిస్తున్నట్లు బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. పల్నాడు నుంచి కూడా అదనపు బస్సులు ప్రధాని సభకు తరలిస్తున్నారు. ఆయా బస్సులను బుధవారం రాత్రి నుంచే గమ్యస్థానాలకు చేర్చారు. నియోజక వర్గాల నుంచి జనసమీ కరణకు సంబం.ధించి ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుంటున్నా రు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బస్సులను ఆయా ప్రాంతాలలో గురువారం ఉద యమే అందుబాటులో ఉంచనున్నారు.



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

నేటి నుంచి సూపర్ జీఎస్టీ ఉత్సవ్

ఏసీ కళాశాలలో రంగవల్లుల పోటీలు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్‌ను గురువారం నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఏసీ కళాశాలలో మహిళలు, విద్యార్థినులకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతామాధురి, సహాయ కమిషనర్ అనసూయ ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0పై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు జిల్లా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, జిమ్ ఫిట్నెస్, సోలార్, బుక్స్‌స్టేషనరి, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు తదితరాలకు దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు బోగీలో మహిళపై
అత్యాచారం

సెల్‌ఫోన్, 5,600 నగదు దోపిడీ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు బోగీలో ఒంటరిగా ఉన్న ఓ మహిళను కత్తితో బెదిరించి అత్యాచారం చేసి ఆమె వద్ద నుంచి సెల్‌ఫోను, 5వేల 600 నగదు దోపిడీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గుంటూరు జిల్లాలో ఈ నెల 13న జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. కేసు వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ 13న సంత్రగచి - చర్లపల్లి స్పెషల్ ట్రైన్‌లో రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ వెళుతుంది. రాజమహేంద్రవరానికి చెందిన ఈ మహిళ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంది. ఆమె ప్రయాణిస్తున్న బోగీలో ఆమె ఒక్కరే ఉన్నారు. రైలు సోమవారం రాత్రి 7 గంటల పది నిమిషాలకు గుంటూరు రైల్వేస్టేషన్‌కి వచ్చింది. ఆ తర్వాత ఏడు గంటల 25 నిమిషాలకు నల్లపాడు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. నల్లపాడు నుంచి బయలుదేరగానే గుర్తుతెలియని వ్యక్తి బోగీలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ఆ మహిళ ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడుతోంది. ఆమె ఫోన్ మాట్లాడటం పూర్తవగానే కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ గుంజుకుని స్విచ్చాఫ్ చేశాడు. అనంతరం ఆమె బ్యాగ్‌లో ఉన్న ఐదు వేల 600 నగదు గుంజుకుని ఆమెపై అత్యాచారం చేసి రైలు పెదకూరపాడు స్టేషన్‌ను సమీపిస్తున్న సమయంలో 100 మీటర్ల దూరంలో రైలు నెమ్మదించగా కిందకు దూకి పారిపోయాడు. దీంతో బాధితురాలు రైల్లో సికింద్రాబాద్ వెళ్లాక అక్కడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదుతో గుంటూరు రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. గుంటూరు రైల్వే డీఎస్పీ అక్కేశ్వరరావు, సీఐ అంజిబాబు ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు విచారణ జరుపుతున్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా ఆమె ఉన్న బోగీలోకి ఇక్కడ ఎవరూ ఎక్కలేదని తేలింది. అంటే అప్పటికే బోగీలో నిందితుడు ఉన్నడా లేదంటే నల్లపాడులో రైలు ఎక్కాడా అనేది తేలలేదు. అలాగే పోలీసులు నల్లపాడు, సిరిపురం, పెదకూరపాడు రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎక్కడా నిందితుడి ఆనవాళ్ళు లభ్యం కాలేదు. అయితే ఆయా గ్రామాల్లో ఉన్న ప్రైవేటు కెమెరాల పుటేజ్‌లు పరిశీలిస్తున్నారు. సాధ్యమైనంత తొందర లోనే నిందితుడిని అరెస్టు చేస్తామని రైల్వే సీఐ అంజిబాబు తెలిపారు.

ప్లాస్టిక్ ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమయింది. ఉదయం నిద్ర లేవగానే పాల ప్యాకెట్లతో మొదలయ్యే ప్లాస్టిక్ వినియోగం కూరలు, పళ్లు, టిఫిన్ ఇతర వస్తువులు ఏవి కొన్నా ప్లాస్టిక్ కవర్లనే ప్రజలు వినియోగిస్తున్నారు. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా దానికి దూరంగా ఉండలేకపోతున్నారు. ప్లాస్టిక్‌ను తయారు చేసే, వినియోగించేవారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడకుండా వ్యవహరిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా జరుగుతోంది.



నిషేధమా అదెక్కడ?

- జిల్లాలో ఎక్కడా అమలు కాని ప్లాస్టిక్ నిషేధం
- విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు
- తనిఖీలు మరచిన అధికారులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్లాస్టిక్‌ను నిరోధించాలని అధికారులను ఆదేశిస్తోంది. డిసెంబరు నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజలు సంబంధిత అధికారులు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలోని పట్టణాలతో పాటు పల్లెల్లోనూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ఉదయం పాల ప్యాకెట్ నుంచి ప్లాస్టిక్ వినియోగం ప్రారంభమవుతోంది. ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిత్యం వేల సంఖ్యలో వినియోగిస్తున్నారు. వ్యాపారులు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. కూరగాయలు, సరుకులు, పళ్ల ఇలా ఏమి కొనుగోలు చేసినా ప్లాస్టిక్ సంచుల్లోనే ఇస్తున్నారు.

● తనిఖీలను మరిచిన అధికారులు

ప్లాస్టిక్ వినియోగంపై మునిసిపాలిటీలు, పంచాయతీలు, సచివాలయాల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. మునిసిపల్ అధికారులయితే తనిఖీలను పూర్తిగా మరిచారు. తిరిగి వాడుకునేందుకు పనికిరాని.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌తో తయారు చేసిన పాలథిన్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఇలా 18 రకాల ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రప్రభుత్వం నిషేధం విధించింది. నిషేధిత ప్లాస్టిక్ జాబితాలో 75 మైక్రాన్లలోపు మందం ఉన్న క్యారీ బ్యాగులతో పాటు 50 మైక్రాన్లలోపు మందం ఉన్న ప్లాస్టిక్ షీట్లు, పాన్ మసాలా ప్యాకెట్లతో పాటు మరో 18 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులను చేర్చారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, స్పూన్లు, స్ట్రాలు తదితరాలన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. నిషేధాన్ని క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అమలు చేయాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను అరికట్టడంతో యంత్రాంగం (మిగతా 8వ పేజీలో)



ప్లాస్టిక్ కవర్లలో కూరల ప్యాకింగ్

● కఠినమైన చట్టాలున్నా అమలేది..!

కఠినమైన చట్టాలు ఉన్నా వీటిని అమలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్లాస్టిక్ నిషేధిత చట్టాలను అమలు చేయటంలో అధికారులు వెనకడుగు వేస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవటం మాట ఎలా ఉన్నా ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరం. ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. ఒక వైపు చట్టాలను అమలు చేస్తూ మరో వైపు ప్రజలను చైతన్య పరిస్తే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.

21న మంగళగిరి బెటాలియన్‌లో
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- హాజరు కానున్న సీఎం, హోంమంత్రి..
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం ఈ దఫా మంగళగిరి బెటాలియన్‌లో నిర్వహించనున్నారు. ఈ నెల 21న రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ మేరకు బుధవారం ఆయా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. కార్యక్రమం జరుగబోయే ప్రదేశాన్ని సమీక్షించి, భద్రతా ఏర్పాట్లు, అమరవీరుల స్తూపం, స్టేజి నిర్మాణం, పరేడ్ నిర్వహణ స్థలం, అలాగే అధికారులు, సిబ్బంది కూర్చునే ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించి, సమీక్షించారు. ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ అమర వీరుల త్యాగాలను స్మరించుకునే ఈ వేడుకను గౌరవప్రదంగా, అద్భుతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ, ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఏర్పాటును జాగ్రత్తగా, సమయానికి పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే, పరేడ్ నిర్వహణలో పాల్గొనే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, కమ్యూనికేషన్, ఏఆర్, సివిల్ పోలీసులు తదితర విభాగాలు పరస్పర సహకారంతో పనిచేసి, అమరవీరుల దినం రాష్ట్రంలో ఆదర్శప్రాయంగా నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని ఎస్పీ అన్నారు. 6వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ మురళి, గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) రమణమూర్తి, సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, బెటాలియన్ కమాండ్ అధికారులు, ఇంజినీరింగ్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ వీసీకి రెండు పదవులు

వర్సిటీ నిర్ణయంపై తీవ్ర విమర్శలు



జగన్‌తో రాజశేఖర్

ఏఎన్‌యూ అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కేంద్ర కార్యాలయంగా మార్చడంతో పాటు పలు అవినీతి, ఆరోపణలతో వీసీ పదవిని పోగొట్టుకున్న మాజీ వీసీ ఆచార్య రాజశేఖర్‌కు సీనియార్టీ పేరుతో తాజాగా రెండు పదవులను కట్టబెట్టడం తీవ్ర విమర్శలకు దారితీసింది. తాత్కాలిక వీసీ ఆచార్య గంగాధరరావు పదవి నుంచి దిగిపోయే ముందు రాజశేఖర్‌ను రెండు పదవుల్లో నియమించారు. వర్సిటీ ఆంగ్ల విభాగం బీఓఎస్ ఛైర్మన్ పదవితో పాటు హ్యూమనిటీస్ డీన్ ఆచార్య రత్నషీలామణి ఉన్నత విద్యా మండలి ఉపాధ్య క్షురాలుగా వెళ్లిపోవడంతో ఆ రెండు పదవులు ఖాళీ అయ్యాయి. దీంతో ఆ రెండు పదవులను రాజశేఖర్‌కు ఆచార్య గంగాధరరా వు కట్టబెట్టారు. వైసీపీ హయాంలో ఏఎన్యూకు 2019 నుంచి 2024 జూన్ 30 వరకు ఆచార్య రాజశేఖర్ తాత్కాలిక వీసీగా పనిచేశారు. వీసీగా ఆయన వైసీపీ ప్రభుత్వ సేవలో తరించారు. వర్సిటీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటుతో పాటు ఇంజనీరింగ్ కళాశాలకు కూడా ఆయన పేరు పెట్టారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానులకు మద్దతుగా వర్సిటీలో సదస్సు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా అప్పటి సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సదస్సులు నిర్వహించి పుస్తకం రూపంలో ముద్రించారు. ఇలా రాజశేఖర్ వైసీపీ కార్యకర్తగా వ్యవహరిస్తూ వీసీ పదవి గౌరవాన్ని దిగజార్చారనే విమర్శలు పెద్దఎత్తున వచ్చాయి. ఇలాంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వంలో ఏకంగా రెండు పదవులు కట్టబెట్టడంపై విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విమానంలో వస్తారు.. రైళ్లలో చైన్ స్నాచింగ్ చేస్తారు

- అస్సోం దొంగల ముఠా అరెస్టు..
- పోలీసు కస్టడీలో గ్యాంగ్ లీడర్ సహా నలుగురు నిందితులు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో రైళ్లలో వరుస చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడిన అంతర రాష్ట్ర దొంగల ముఠాను గుంటూరు రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. గత నెలలో కృష్ణా కెనాల్ వద్ద వరుసగా జరిగిన నేరాలకు సంబంధించి.. ముఠాలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి.. పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఇందులో గ్యాంగ్ లీడర్ అస్సోంలోని చంజగ్మాజీపత్తర్ ప్రాంతానికి చెందిన సంజోయ్‌రాయ్ అలియాస్ సంజు కూడా ఉన్నాడు. ఇతనిపై మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. ముఠాలోని మరో నిందితుడు హరియాణాలోని సత్రోద్ కలాన్‌కు చెందిన మాజీ ఆర్మీడు రిజర్వ్ జవాన్ సతేందర్‌కుమార్ కావడం గమనార్హం. ఇతను ఓ హత్య కేసులో శిక్ష అనుభవించాడు. దీంతో అతనిని సర్వీస్ నుంచి తొలగించారు. ఆ తర్వాత అరక్కోణం రైల్వే పోలీసులు ఓ దొంగతనం కేసులో అరెస్టు చేసి జైలుకు పంపారు. మిగిలిన ఇద్దరూ రాజస్థాన్‌లోని బిలోతికా నార్లా గ్రామానికి చెందిన సతీష్‌గుజ్జర్, సవాయి మాథోపూర్ జిల్లా గంగాపూర్ నగర్‌కు చెందిన రవికుమార్ నిందితులు. కాగా, చెన్నై పోలీసులు



పట్టుబడిన నిందితులతో గుంటూరు రైల్వే పోలీసులు

గుంటూరు రైల్వే పోలీసుల సమాచారంతో అక్కడ మరో నిందితుడిని అరెస్టు చేశారు. కృష్ణా కెనాల్ వద్ద రైలులో నేరానికి పాల్పడిన ఈ ముఠాలో ప్రధాన నిందితుడు సంజోయ్‌రాయ్.. గుంటూరు రైల్వే స్టేషన్‌కు సమీపంలోని మూడు వంతెనల వద్ద రైలు దిగి.. హైదరాబాద్ చేరుకుని విమానంలో గౌహతి వెళ్లిపోయాడు. సంజోయ్‌రాయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల ముఠా అస్సోం నుంచి విమానంలో వచ్చి.. చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడేందుకు ప్రశాంతి, సర్సాపూర్ తదితర రైళ్లను ఎంచుకున్నారు. ఈ కేసులో రైల్వే పోలీసులకు తీగలాగితే డొంక కదిలింది. ఇప్పటికే ఏపీ, తెలంగాణ, అస్సోం, రాజస్థాన్, బిహార్ తదితర రాష్ట్రాల్లో ఈ ముఠాపై పదుల సంఖ్యలో రైళ్లలో చైన్ స్నాచింగ్స్, దోపిడీలకు పాల్పడిన కేసులు ఉన్నట్లు తేలింది. ఈ ముఠా కోసం ఆయా రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నారు. ఈ ముఠా మోస్ట్ వాంటెడ్ జబితాలో ఉంది. అయితే ఇంత వరకు తమిళనాడు తప్ప ఏ రాష్ట్రంలోనూ వీరిని పోలీసులు పట్టుకోలేకపోయారు.

15 మందితో ముఠా

సంజోయ్‌రాయ్ నేతృత్వంలో 15 మంది సభ్యులతో ఓ ముఠా 2015 నుంచి రైళ్లలో చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతోంది. గతంలో ఒకసారి తమిళనాడులోని జోలార్‌పేట్ రైల్వే పోలీసులు 20 కేసుల్లో నిందితులుగా ఉన్న ఈ ముఠాను అరెస్ట్ చేశారు. గుంటూరు పరిధిలో ఈ ముఠాపై 15 కేసులు ఉన్నాయి. అలాగే విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం, సికింద్రాబాద్, చెన్నై తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కేసులు ఉన్నట్లు గుంటూరు రైల్వే డీఎస్పీ అక్కేశ్వరరావు, సీఐ అంజిబాబు తెలిపారు. గుంటూరు పరిధిలోని కృష్ణా కెనాల్ వద్ద వరుసగా జరిగిన నేరాలకు పాల్ప డింది ఈ ముఠాగా తేలింది. రైళ్లలో కిటికీల పక్కన, రాత్రిళ్ల నిద్రపోయే ప్రయాణికులను గమనించి చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడతారు. ఒకరు మెయిన్‌డోర్ వద్ద ఉంటారు, మరొకరు నేరానికి పాల్పడతారు. ఒకవేళ నిందితుడిని పట్టుకునేందు కు ప్రయాణికులు ప్రయత్నిస్తే.. మి గిలిన వారంతా అక్కడకు చేరుకుని ఎదురు దాడికి దిగుతారు. కదులు తున్న రైలు నుంచి దూకి పారిపో తారు. ముందుగా ఈ ముఠా అ స్సోం నుంచి విమానంలో నేరం చేయాల్సిన రాష్ట్రానికి చేరుకుంటుంది. అక్కడ నేరం చేశాక తిరిగి దర్జాగా విమానంలో అస్సోం వెళ్లిపోతారు. వారిని చూస్తే వ్యాపారులు, ధనవం తులనుకోవాల్సిందే. అంతలా బిల్డప్ ఇస్తూ.. పోలీసుల కళ్లుగప్పి నేరాలకు పాల్ప డుతున్నారు.



మేజర్ భరద్వాజ్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు



మేజర్ తేజ్ భరద్వాజ్ అంతిమ యాత్రలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు

తేజ్.. అమర్‌రహే

- మేజర్ భరద్వాజ్‌కు కన్నీటి వీడ్కోలు
- అధికార లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు
- నివాళులర్పించిన కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు, ప్రజలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో యుద్ధ విన్యాసాలు చేస్తూ మరణించిన గుంటూరుకు చెందిన మేజర్ తేజ్‌భరద్వాజ్‌కు కుటుంబసభ్యులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. తొలుత ఉదయం సంగడిగుంటలోని ఆయన నివాసం వద్ద సైనిక సెరిమోని నిర్వహించారు. సంగడిగుంట, ఆర్‌అగ్రహారం మీదగా శ్రీనివాసరావుపేట, కైలాసిగిరి వరకు అంతిమయాత్ర సాగింది. దాదాపు గంటసేపు సాగిన మేజర్ అంతిమయాత్రలోప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్థీవదేహంపై పూలు జల్లుతూ అమర జవాను.. అమర్‌రహే అం టూ నినాదాలు చేశారు. అనంతరం మధ్యాహ్నం శ్రీనివాసరావుతోట లోని కైలాసగిరిలో అధికార లాంఛనాలతో మేజర్ అంత్యక్రియలను పూర్తి చేశారు.

తరలివచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు

మేజర్ అంతిమయాత్రలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఆయన నివాసం వద్ద మేజర్ పార్థీవ దేహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నసీర్ అహమ్మద్, గళ్లా మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, వైసీపీ తూర్పు ఇన్‌చార్జి నూరిఫాతిమా, తూర్పు తహసీల్దారు సుభాని తదితరులు నివాళులర్పించారు. ఆపరేషన్ సింధూర్‌లో తేజ్ చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. మేజర్ త్యాగం మరవలేనిదన్నారు. కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో
జాగ్రత్తలు పాటించాలి

రైతు సేవా కేంద్రం సిబ్బందికి సివిల్ సప్లయ్ మేనేజర్ తులసి

పొన్నూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ తులసి తెలిపారు. ఖరీఫ్ ధాన్య సేకరణపై మండల పరిధిలోని ములుకుదురు, చింతలపూడి, మునిపల్లె రైతు సేవా కేంద్రాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17 శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టించి కొనుగోలు చేయాలని సిబ్బందిఇకి సూచించారు. కొనుగోలు కేంద్రం, మిల్లు వద్ద ధాన్యం తేమ శాతం ఒకేవిధంగా ఉండేలన్నారు. గోతాలు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా 17 శాతం తేమ ఉండేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారి ఆర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం 75 కేజీల బస్తాకు రూ.1792/- కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ట్రాక్టర్‌కు జీపీఎస్ పరికరం అమర్చి దాని ద్వారా ధాన్యం రవాణా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీకాంత్, జీడీసీఎంఎస్ ప్రతినిధులు కొల్లి ప్రసాదరావు, రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కల్పిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

నిషేధమా అదెక్కడ..?

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా విఫలమవుతోంది. నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు సాగుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.

● పర్యావరణంపై తీవ్ర ప్రభావం

పర్యావరణంపై ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాలువల్లో పూడిక తీసే సమయంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఉంటున్నాయి. ఈ కవర్ల వినియోగంపై నియంత్రణ కనిపించటం లేదు. విందు, వినోదాలలో కూడా ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ సామగ్రిని వినియోగిస్తున్నారు. చివరకు కూరలు, అహారం ప్యాకింగ్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్, కవర్లను వాడుతున్నారు. వేడి అహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడం వల్ల అవి కరిగి అహారంలో కలసిపోతూ ప్రాణ సంకటంగా మరుతున్నాయి. అలాగే పట్టణాలలో ఏ మురుగు కాలువ చూసినా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కన్పిస్తున్నాయి.మురుగు కాలువలు పూడిపోవటానికి ప్లాస్టిక్ ఒక కారణంగా ఉంది. పట్టణాలలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలలో నాలుగో వంతు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు మొదటి పట్టణ సీఐ శక్తి ఫిరోజ్ బుధవారం తెలిపారు. పట్టణంలో సెక్షన్ 30 అమలులో ఉందని, మంగళవారం అనుమతులు లేకుండా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టడంతో.. డాక్టర్ గోపిరెడ్డితో పాటు మరో 22 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తెనాలిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● రాత్రి 11 గంటలు దాటి రోడ్లపై తిరిగితే చర్యలు ● ఎస్పీ వకుల్ జిందాల్

తెనాలి క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో పూర్తిస్థాయిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీగా మొదటిసారి ఆయన పట్టణ పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, నేర చరిత్ర ఉన్నవారి కదలికలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు గస్తీ, బీట్ల సంఖ్యను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలపై హింసాత్మక ఘటనలు, లైంగిక వేధింపుల కేసుల్లో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. గంజాయిపై పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై దగ్గరలోని పోలీసుస్టేషన్ లేదా 112, 1930 నంబర్లను సంప్రదించాలని సూచించారు. తెనాలి పట్టణంలో రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఒంటరిగా, గ్రూపులుగా కారణం లేకుండా రోడ్లపై తిరుగుతుంటే.. పోలీసులు విచారణ చేసి.. అవసరమైతే అదుపులోకి తీసుకుంటారన్నారు. పట్టణ పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో నూతన భవనాలు ఏర్పాటు ప్రభుత్వ పరిశీలన ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలోని రౌడీషీటర్లు, కేసుల పరిష్కారం వివరాలను ఎస్‌హెచ్‌వోలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. డీఎస్పీ జనార్దనరావు, పట్టణ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఉరేసుకొని వివాహిత మృతి

● చేబ్రోలు ఉప్పరపాలెంలో ఘటన ● భర్త వేధింపుల వల్లేనని ఆమె తల్లిదండ్రుల ఆరోపణ



వైజయంతి (ఫైల్‌ఫొటో)

చేబ్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం ఉప్పరపాలెంలో బుధవారం ఓ వివాహిత ఉరేసుకొని అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. భర్త వేధింపుల వల్లే తమ కుమార్తె ప్రాణాలు తీసుకుందని ఆమె తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. చేబ్రోలు ప్రాంతానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి, అదే ప్రాంతానికి చెందిన వైజయంతికి (23) నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 50 వేల నగదు, కొంత బంగారం కట్నంగా ఇచ్చారు. అంతేకాక ఒక సెంటు భూమి ఇస్తామని వైజయంతి తల్లి హామీ ఇచ్చినట్లు సమాచారం. వీరికి ఏడాది క్రితం ఓ ఆడశిశువు పుట్టింది. అయితే గత కొంతకాలంగా భూమి కాగితాలు తీసుకురావాలని భర్త ప్రసాద్, అత్త ఉష తరచూ వైజయంతిని వేధిస్తున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ప్రసాద్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, దాంతో తనను వేధించడం పెంచాడని వైజయంతి తన తల్లిదండ్రుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం వైజయంతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చేబ్రోలు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరనారాయణ తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సత్తెనపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జర్దార్ బాబును సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైస్కూల్‌లో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న ఆరోపణలతో ఆయనను సస్పెండ్ చేశారు. గతంలోను పలు పాఠశాలల్లో విద్యార్థినుల పట్ల ఆయన అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

వివాహిత ఆత్మహత్య

బెల్లంకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలం లోని చంద్రాజుపాలెం గ్రామం లో బుధవారం చోటు చేసు కుంది. గ్రామానికి చెందిన ఎం.నాగరిక(25)కు రాజుపాలెం మండలం అను పాలేనికి చెందిన రవితో కొద్ది నెలల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో భర్త వేధింపుల తాళలేక మనస్థాపానికి గురై ఆమె తల్లిదండ్రుల ఇంటి వచ్చిందని గ్రామస్థులు తెలిపా రు. అక్కడే ఉరి వేసుకొని ఆ త్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెదకాకాని ఆలయ హుండీల కానుకల లెక్కింపు

● 77 రోజుల ఆదాయం రూ.36,36,324



శివాలయంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెదకాని మల్లేశ్వరస్వామి దేవస్థా నంలో బుధవారం కానుకల హుండీలను తెరచి, కల్యాణ మండపంలో లెక్కించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవదాయశాఖ పర్యవేక్ష ణాధికారిగా జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పి. సైదమ్మబాయి వ్యవహరించారు. 77 రోజులకు గాను రూ.36,36,324, అన్నదానం హుండీ ద్వారా రూ.2,05,399, బంగారం 8.500 మి.గ్రా, వెండి 340 గ్రాములు, యూఎస్‌ఏ డాలర్లు 24, ఆస్ట్రేలియా డాలర్లు 70, కెనడా డాలర్లు 50, ఇంగ్లాండు పౌండ్లు 10 వచ్చాయని దేవస్థాన ఉప కమిషనర్ తెలిపారు.

అంబటిని మించిన బడుద్దాయి మరొకరు లేరు: కనపర్తి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబుని మించిన బడుద్దాయి, బఫూన్ మరొకరు లేరని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి లోకేశ్‌పై కారుకూతలు కూస్తే అంబటికి బడితె పూజ తప్పదని హెచ్చరించారు. 30 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యేగా అతి కష్టమ్మీద రెండోసారి గెలుపొందిన ఆయన చరిత్ర జిల్లా ప్రజలకు తెలియంది కాదన్నారు. రేపల్లెలో ఓడిన రెండుసార్లు టీడీపీ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ అన్ని ఓట్లు కూడా అంబటికి రాకపోవడం సిగ్గుచేటన్నారు. లోకేశ్ ఓడినచోటే మళ్లీ పోటీ చేసి పులివెందులలో జగన్‌రెడ్డికి సైతం ఎప్పుడూ రాని మెజార్టీతో విజయం సాధించారన్నారు. అంబటి దెబ్బకు ఏఐసీసీ సైతం భయపడి.. గతంలో 25,000 ఓట్ల తేడాతో ఓడిన వారెవరూ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేయవద్దని హెచ్చరించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అంబటి పులివెందులలో తప్ప ఎక్కడ నుంచి పోటీచేసినా డిపాజిట్లు రావని వైఎస్‌తో ఏఐసీసీ పెద్దలు చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రేపల్లె ప్రజలు తన్ని, తరిమేస్తే సత్తెనపల్లి వచ్చి పడిన ఆయనను, అక్కడ సొంత పార్టీ నేతలే తీవ్రంగా ఛీ కొడితే మళ్లీ గుంటూరు వచ్చి పడ్డాన్నారు. లోకేశ్‌పై అంబటి మరోసారి నోరు పారేసుకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కనపర్తి హెచ్చరించారు.

లారీని ఢీకొని యువకుడి మృతి

నరసరావుపేట లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లారీ వెనక చక్రాల కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం పట్టణంలోని గుంటూరు రోడ్డులో చోటుచేసుకుంది. రెండవ పట్టణ సీఐ మరో వివరాల మేరకు.. కారంపూడికి చెందిన బసంతి గణేష్ (26), రాగి హనుమంతు ఆచారి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గుంటూరు వెళ్తున్నారు. కలకత్తా నుంచి నరసరావుపేట వైపు గుంటూరు రోడ్డు నుండి వేరుశనగపప్పు లోడుతో వస్తున్న లారీ వెనక చక్రాలను వారు ఢీకొట్టారు. ఈ ఘటనలో బసంతి గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతాచారికి తీవ్ర గాయాలయ్యాయి. మొదటి పట్టణ సీఐ హైమారావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని.. లారీ చక్రాల కింద ఇరుక్కున్న మోటార్ సైకిల్‌ను బయటకు తీశారు. గణేష్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

డిజిటల్ ఇండియా మార్గదర్శిగా ఏపీ

● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి

రెంటచింతల,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో గూగుల్ సంస్థ రూ.87,500 కోట్ల పెట్టుబడితో దక్షిణ ఆసియా ఖండంలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ నిర్మించడానికి ముందుకు రావడం టెక్ విప్లవానికి నాంది అని శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెంటచింతలలో ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సిటీ ఆఫ్ డెస్టినిగా ఉన్న విశాఖ నగరం ఇకపై ఏఐ డిజిటల్ సిటీ రాజధానిగా మారనుందన్నారు. రాష్ట్రంలో యువతకు ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారన్నారు.

49,453 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,748 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,453 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,250 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	13800	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	---	---	4884	---	---
సూపర్ 10	---	---	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15800	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

గుంటూరు సిటీ వార్తలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర

జీఎస్టీ 2.0తో పేదలకు ఊరట

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీఎస్టీ 2.0 తో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఊరట లభిస్తుందని గుంటూరు నగర మేయర్ చెప్పారు. ప్రధాని మీటింగ్ ఏర్పాట్లలో భాగంగా కర్నూల్ నగరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 16న కర్నూలులో జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభకు ప్రధాని మోదీ రానున్నారని తెలిపారు. కర్నూల్‌లో సుమారు రూ. 13,430 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సిబ్బంది రికార్డు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరానికి తాగు నీటిని అందించే హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం కమిషనర్ జీఎంసీ హెడ్ వాటర్ వర్క్స్, మానససరోవరం దగ్గర కల్వర్టు, ఆర్టీసీ కాలనీ, చిన్నేరు కుంట, కోబాల్ట్‌పేటలో పీకలవాగు ఆక్రమణలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేశ్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీ రింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఎంసీ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు నిష్ణాతులతో కమిటీ

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల పరిశీలన, పర్యవేక్షణకు వివిధ రంగాల నిష్ణాతులతో ఒక సంయుక్త కమిటి ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య రంగాల్లో నిష్ణాతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన కమిటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, విష్ణు, వేణు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సదాశివ రావు, రాఘవరావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

తురకపాలెం ఘటనపై వైసీపీ కుటిల రాజకీయాలు

● మండిపడ్డ జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె

గుంటూరు మెడికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో సంభవించిన మరణాలపై వైసీపీ నేతలు కుటిల రాజకీయాలు చేస్తున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. పేద ప్రజల చావును కూడా స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం ఆ పార్టీ నేతలకే చెల్లిందని ఆయన మండిపడ్డారు. నగరంలోని లాడ్జి సెంటర్ కూడలిలో గల జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరామర్శల పేరిట తురకపాలెంలో బుధవారం పర్యటించిన వైసీపీ నాయకులు గ్రామంలో కులాల మధ్య గొడవలు పెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇంచార్జీగా ఉన్న బలసాని కిరణ్‌కుమార్ గతంలో బాధలో ఉన్న తురకపాలెం గ్రామాన్ని సందర్శించే ప్రయత్నం చేయలేదని, పరిస్థితి అంతా చక్కబడిన తర్వాత తాపీగా వచ్చి రాజకీయాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో జనసేన నాయకులు శిఖా బాలు, కొప్పుల కిరణ్, నక్కల వంశీ, చట్టాల త్రినాథ్, లింగేశ్వరరావు, తురకపాలెం సర్పంచ్ డబ్బురి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

క్రీడాల్లోనూ రాణిస్తున్న సీతారామయ్య విద్యార్థులు

● మాజీ ఎమ్మెల్యే, పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారామయ్య పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు ప్రశంసించారు. ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో పాఠశాల విద్యార్థులు టి.షణ్ముఖ్, ఏ.అక్షయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తరపున పోటీ చేసి తమ ప్రతిభ చూపించినందుకు ఆయన వారిని అభినందించారు. పాఠశాల కార్యదర్శి, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం వల్ల ఆరోగ్యకరమైన పోటీతత్వంతో పాటు ఏదైనా సాధించాలనే సంకల్ప బలం పెంపొందుతుందన్నారు. బాస్కెట్‌బాల్ శిక్షకుడు కె.రవి కుమార్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కొ-ఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ- ప్రైమరీ కొ-ఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇంచార్జి కె. హరిప్రియ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దేవినేని మల్లికార్జునరావు, కార్యదర్శి విష్ణువర్ధన్ తదితరులు

ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ సందర్శన

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎన్‌సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ బుధవారం ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ గుంటూరును సందర్శించారు. అనంతరం గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ అధికారులతో సమావేశమయ్యారు. గ్రూప్ కమాండర్ కల్నల్ సుదన్షు దుబే ప్రస్తుత శిక్షణ సంవత్సరంలో హెడ్‌క్వార్టర్స్ చేపట్టిన వివిధ శిక్షణ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అనంతరం వివిధ జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్యాడెట్లను సైలానీ సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు, అధికా రులు తెలిపారు.

రోషన్‌కు అభినందనలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్‌లో ఈ నెల 10 నుంచి 14వరకు జరిగిన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీ ల్లో 110మీటర్ల హర్డిల్స్‌లో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించిన నగరానికి చెందిన షేక్ రోషన్‌ను రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాసరావు, అథ్లె టిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ లాల్‌వజీర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ జీవితం స్ఫూర్తిదాయకం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



కలామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా పట్టాభిపురం మెయిన్‌రోడ్డులోని కలామ్ విగ్రహానికి పూలమాల వేసి బుధవారం ఆమె ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం మనందరికీ ఒక పాఠం, ఒక ప్రేరణ అని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, పాకలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కలాం ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో....

గుంటూరు మెడికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కలలు కనండి వాటిని నిజం చేసుకొనేందుకు కృషి చేయండని చెప్పిన డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని టీడీపీ నాయకుడు డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. కలాం ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుజ్జనగుండ్లలోని వాకర్స్ ట్రాక్‌లో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కలాం ఆశయాలను అనుసరించి దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కనకమేడల అప్పారావు, వణుకురి శ్రీనివాస్ రెడ్డి, పొత్తూరి రంగారావు, భాను ప్రకాష్, కొణిదె మోహన్ గోపికృష్ణ, శివశంకర్‌రావు, మల్లేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు

కలెక్టరేట్‌లో...

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంకు కలెక్టర్ తమీమ్ అన్సారియా నివాళులు అర్పించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలాం జయంతి నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలితో కలసి కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తి గడించిన మహనీయుడు కలాం అన్నారు. దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవికి వన్నె తీసుకు వచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు మల్లేశ్వరి, కళ్యాణి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ శేషయ్య తదితరులు



అబ్దుల్ కలాం జయంతిలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌వో

వైజాగ్ సమ్మిట్‌కు జిల్లా నుంచి భాగస్వామ్యం ఉండాలి

● పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్ పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ - ఇండస్ట్రీస్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవా రం ఈ కార్యక్రమం జరిగింది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో భాగంగా ఈ పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. భాగస్వామ్య సదస్సుపై సంబంధిత వర్గాల్లో అవగాహన, భాగస్వామ్యం కల్పించడానికి అక్టోబరు 15 నుంచి నవంబరు 15వ తేదీ వరకు, నెల రోజుల పాటు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారన్నారు. భాగస్వామ్య సదస్సులో జిల్లా నుంచి ఎక్కువ మంది భాగస్వా మ్యం ఉండాలని కోరారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ప్రతిరోజు వివిధ అంశాలను చేపతామని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్స హించే దిశగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీరు ఎండీ నజీన బేగం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎంఎల్ నరసిం హారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజున 940 కేసులు.. రూ.6.54 లక్షల పెనాల్టీ



ఫిర్యాదుల పరిష్కారాన్ని పరిశీలిస్తోన్న సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో టిక్కెట్ లేకుండా ప్రయా ణిస్తున్న వాళ్లపై ఒకే రోజున 940 కేసులను కమర్షియల్ విభాగం సిబ్బంది నమోదు చేశారు. వీరి నుంచి రూ.6 లక్షల 54 వేల 450 పెనాల్టీ రూపంలో వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒకే రోజున ఇంత పెద్ద మొత్తంలో కేసులు నమోదు చేసి పెనాల్టీలను వసూలు చేయడం గుంటూరు రైల్వే డివిజన్‌లో ప్రప్రథమమని చెప్పారు. కాగా రైళ్లలో సదుపాయాలు, క్యాటరింగ్ సర్వీ సుల గురించి ఆన్‌లైన్‌లో అందే ఫిర్యాదులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారనేది సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం రైల్‌వికాస్ భవన్‌లోని కమ ర్షియల్ కంట్రోలింగ్ ఆఫీసులో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

రెండు ప్యాసింజర్ రైళ్ల కాలమాన పట్టిక మార్పు

రెండు ప్యాసింజర్ రైళ్ల కాలమాన పట్టికని ఈ నెల 20 నుంచి మార్పు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు.67775 కాచీగూడ-మిర్యాలగూడ ప్యాసింజర్ రైలు నిర్ణీత తేదీ నుంచి ప్రతీ రోజు సాయంత్రం 6.35కి బయలుదేరి రాత్రి 10.50కి మిర్యాలగూడ చేరుకొంటుంది. నంబరు.67777 మిర్యాలగూడ-నడికుడి ప్యాసింజర్ రాత్రి 10.55కి బయలుదేరి 11.55కి నడికుడి చేరుకుంటుందన్నారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం కొనుగోలుదారులు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని, తద్వారా కస్టమర్ కొనుగోలు చేసిన మందు బాటిల్ ఒరిజినల్ లేక నకిలీదా అని తెలుసుకోవచ్చని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తను చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ కూడా కల్తీ మద్యం ఉండకూడదని, అదేవిధంగా బెల్ట్ షాపులు ఉండటానికి వీల్లేకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఒకవేళ ఎక్కడైనా బెల్ట్ షాప్‌లో మద్యం దొరికితే కేసు చేయడమే కాకుండా సంబంధిత మద్యం షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, ఏఈ మారయ్యబాబు పాల్గొన్నారు.

3 లక్షల ఇళ్లకు త్వరలోనే ప్రారంభోత్సవం

● హౌసింగ్ ఎండీ అరుణ్‌బాబు వెల్లడి

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికీ అన్ని సౌకర్యాలతో కూడిన పక్కా గృహాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా ఉన్నారని, ఆయన ఆశయానికి అనుగుణంగా మూడు లక్షల గృహాలను పూర్తి చేసి, త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కొత్త ఎండీ పి.అరుణ్‌బాబు చెప్పారు. బుధవారం ఆయన విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంస్థలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశమై పేదల ఇళ్ల నిర్మాణంలో పురోగతిపై సమీక్షించారు. కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ జయరామాచారి, సీజీఎం అన్నపూర్ణ, జనరల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల సమస్యలు పరిష్కరిస్తా: శుభం బన్సల్

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలశాఖ నూతన డైరెక్టర్ శుభం బన్సల్ హామీ ఇచ్చారు. బుధవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా నెలకొల్పే పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పారిశ్రామిక పురోగతికి బాటలు వేస్తానని చెప్పారు.

మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ కక్ష సా ధింపు చర్యల్లో భాగంగా తొలగించిన తపాలా సంఘ ఉద్యమ జాతీయ నాయ కుడు మహాదేవయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం, స్థానిక చంద్రమౌళినగర్‌లో తపాల కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

పరిశుభ్ర చేతులతోనే ఆరోగ్యకర జీవితం

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నిత్యం సబ్బుతో చేతులు కడుక్కోవడం అనే చిన్న అలవాటు ద్వారా, సురక్షిత ఆరోగ్య సమాజానికి బాటలు వేయవచ్చని సీజీహెచ్ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీహెచ్ కోటేశ్వరరావు వెల్లడించారు. బుధవారం గుంటూరు నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. చేతులు కడిగే విధానాన్ని డాక్టర్ కోటేశ్వరరావు వివరించారు.

● గుంటూరు(కార్పొరేషన్): చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఒక చిన్న అలవాటే కాదు, అది ఆరోగ్యాన్ని కాపాడే సాధనంగా ఉపయోగ పడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఐటీసీ ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ రూపొందించిన వాల్ పోస్టర్ ని కమిషనర్ తమ చాంబర్‌లో ఆవిష్కరించారు.

ఏపీ ఛాంబర్స్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని ఐటీసీ కల్యాణ మండపంలో బుధవారం ఏపీ ఛాంబర్స్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. 2025-27 కాలానికి ఏపీ ఛాంబర్స్ సెంట్రల్ జోన్ వైస్ ఛైర్‌పర్సన్‌గా సక్కు మాధవి, మహిళా పారిశ్రామిక వేత్తల విభాగానికి (సెంట్రల్ జోన్) ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ రాయపాటి మమత, వైస్ ఛైర్‌పర్సన్‌లుగా కంచర్ల స్రవంతి, జి.జయశ్రీతో పాటు కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, గుంటూరు కమిషనరేట్, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరైన నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

నూతన వ్యాపార ఆవిష్కరణలపై పరిశోధన చేయాలి

గుంటూరు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన వ్యాపార ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ మంతెన పవన్ రాజ్‌కుమార్ అన్నారు. పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఐటీ బాంబే సహకారంతో నిర్వహించిన స్టార్ట్ అప్ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక మాట్లాడుతూ, ఈ తరహా వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆవిష్కరణా దృక్పథాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.లక్ష్మణ్ నారాయణ, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఐక్య వ్యవస్థాపకులు డాక్టర్ గోళ్ళమూడి రాజు సుందరంబాబు పిలుపునిచ్చారు. అరండల్‌పేటలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చి బిషప్ డాక్టర్ వరబాబు, లాభా, సుకుమార్, సుందర్ సింగు, పాస్టర్ పి.సురేష్, బేతపూడి భారతి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హాథీరామ్ మఠం ఆస్తులు పరిరక్షించండి

● సీఎంకు ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూ నాయక్ వినతి

గుంటూరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంజారా ప్రజల ఆరాధ్య దైవం హాథీరామ్ బావుజీ మఠం ఆస్తులను పరిరక్షించాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని కలసి వినతి పత్రం అందజేశారు. 'హాథీరామ్ బావుజి మఠం పరిరక్షణ కమిటీ'ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు సీఎం సానుకూలంగా స్పందించారని ధారూనాయక్ తెలిపారు. ఈ కమిటీలో బంజారా ప్రముఖులు సభ్యులుగా ఉండేలా, ఒక ఆర్డీవో స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారని చెప్పారు.

సైబర్ ముప్పును ఎదుర్కొనేందుకు బహుముఖ వ్యూహం

దేశంలో రోజురోజుకు పెరు గుతున్న సైబర్ నేరాల ముప్పును ఎదుర్కొనేందుకు హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ నేరాల సమన్వయ కేంద్రం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోందని కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి అన్నారు. బుధవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

యువకుడిని నిర్బంధించి దాడిపై కేసు నమోదు

ఉద్యోగం మానేసినందుకు యువకుడిని నిర్బంధించి కొట్టిన ఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. వినుకొండకు చెందిన వడ్లమూడి ఈశ్వర్ పవన్‌కుమార్ రెండు నెలల క్రితం ఆరండల్‌పేటలోని పిక్సెల్‌పైలెట్ డిజిటల్ సొల్యూషన్స్ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాడు. అయితే వారు జీతం సరిగా ఇవ్వకపోవటంతో కొన్ని రోజుల క్రితం అక్కడ మానేసి వేరే చోట చేరాడు. ఈనెల 9న అతను హాస్టల్‌లో ఉండగా సదరు ఆఫీసుకు చెందిన నలుగురు వ్యక్తులు మాట్లాడాలి అని చెప్పి పవన్‌కుమార్‌ను కార్యాలయానికి తీసుకెళ్ళి అక్కడ నిర్బంధించి రాడ్లు, వైర్లతో దాడి చేశారు. పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి

మైనారిటీల అభ్యున్నతికి కృషి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి అన్ని విధా లా కృషి చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. డిప్యూటీ కలెక్టర్, మైనారిటీ జిల్లా ఆఫీసర్ పార్థసారధితో కలిసి బుధవారం ఆయన గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రధాన మంత్రి జన వికాస్' కార్యక్రమంలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో మైనారిటీల కోసం అభివృ ద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక బ్లూలైట్ సెంటర్లో మల్టీపర్పస్ స్కిల్ సెంటర్, ఫంక్షన్ హాలు నిర్మించనున్నామని తెలిపారు. రెడ్ ట్యాంక్ వద్ద షాదీఖానా, ఉర్దూ ఇనిస్టిట్యూట్, లైబ్రరీలతో కలిపి బిల్డింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీంతోపాటు మైనారిటీ బాల, బాలికల హాస్టల్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. నందివెలుగు రోడ్డు ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తామని, అంజుమన్ పాఠశాలలో స్కిల్ సెంటర్‌తోపాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలామ్

కల అంటే నిద్రపోతే వచ్చేది కాదని, నిద్రలేకుండా చేసేదని యువతకు లక్ష్యాలను నిర్దేశించిన మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలామ్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నసీర్ నివాళులర్పించారు.



కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ, గజల్ శ్రీనివాస్ తదితరులు

కళాకారులను ఆదుకునేందుకు కృషి

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాటకాలకు పునరుజ్జీవం తీసుకొచ్చి, కళాకారులను ఆదుకుంటామని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి అభినయ సంస్థ ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ గుంటూరు వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మూడు రోజుల పాటు జరిగే నారా చంద్రబాబు నాటకోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నాటకాలకు పూర్వ వైభవం తీసుకువచ్చి, కళాకారులకు గౌరవం దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ఓ కాశివానీ రావయ్య, బంధనం నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, అభినయ శ్రీనివాస్, రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, దేగల ప్రభాకర్

చంద్రబాబు దూరదృష్టి రాష్ట్రానికి వరప్రసాదం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి రాష్ట్రానికి వరప్రసాదమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం చంద్రబాబును ఆమె మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభం, గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా ఇచ్చి ఆనందాన్ని రెండింతలు చేశారని ఆమె అన్నారు.

● గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు బలోపేతమే మా లక్ష్యం

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని 10 ఎస్సీ 5 బీసీ, 4 ఎస్టీ హాస్టళ్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాస్టళ్లలో ఉన్న వసతులు, విద్యార్థుల భోజన నాణ్యత, స్టడీ అవర్స్ నిర్వహణ వంటి అంశాలపై కూలంకషంగా చర్చించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 5009 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 5009 క్యూసెక్కులనీరు బుధవారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 93,900 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 246 క్యూసెక్కుల నీరు, రేపల్లెకాల్వకు 1039, తూర్పు కాల్వకు 593, పశ్చిమ కాల్వకు 198, నిజాంపట్నంకాల్వకు 392, కొమ్మమూరుకాల్వకు 2580 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

తాడేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధి పిలుపు మేరకు ఉండవల్లి సెంటర్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దర్శనపు శామ్యూల్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై అవగాహన కల్పించి స్థానికుల నుంచి సంతకాలు సేకరించి ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ సలీమ్ సెంటర్‌లో ప్రతి షాప్‌కు వెళ్లి ఓట్ల చోరీపై అవగాహన కల్పించారు. సలీమ్ మాట్లాడుతూ ఓట్ చోరీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రేమిడిశెట్టి హనుమంత రావు, కొప్పాకుల కృష్ణచౌదరి, షేక్ సుభాని, షేక్ ముస్ని, సమర్పణకుమార్, దేవినేని శ్రీరామమూర్తి, జాకిన్‌రెడ్డి, షేక్‌నాగూర్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

మంగళగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు అనుసరించవలసిన హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య విధానం (సీపీఆర్)పై బుధవారం మంగళగిరి ఇందిరానగర్ అర్బన్ ప్రాథమిక కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిమ్స్ కమ్యూనిటీ ఫ్యామిలీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ అనంత ప్రకాష్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, వీజే కళాశాల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

డ్రైయిన్ల నిర్మాణానికి నిధులు

గుంటూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు, రూరల్ మండలం, తురకపాలెం, ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ డ్రైయిన్ల నిర్మాణానికి జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘ నిధుల్లో రూ.30 లక్షలు మంజూరు చేసినట్టు సీఈవో జ్యోతిబసు ఒక ప్రకటనలో తెలిపారు. కేటాయించిన రెండు పనులు నిర్ణీత కాలంతో పూర్తి చేయాలని లేని పక్షంలో పనులను రద్దుచేస్తామని ఆమె పేర్కొన్నారు.

వడ్డేశ్వరం హైస్కూల్లో నూతన కంప్యూటర్ లాబ్

తాడేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని జడ్పీ హైస్కూల్‌లో నూతన కంప్యూటర్ లాబ్ ఏర్పాటుకు తరగతి గదిని ముస్తాబు చేస్తున్నారు. పాఠశాలలో స్మార్ట్ డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు పాఠశాల హెచ్ఎం కాకుమాను జోజప్ప తెలిపారు. ముస్తాబవుతున్న డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ రూమ్‌ను డీవైఈవో జి.శాంతకుమారి బుధవారం సందర్శించి పలు సూచనలు చేశారు.

కేఎల్‌యూలో దంత వైద్యశిబిరం

తాడేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఉమన్ డెవలప్‌మెంట్ సెల్, యూత్ రెడ్ క్రాస్, కాలేజి ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో బుధవారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, భరణి డెంటల్ కేర్ వైద్యులు సీఎల్‌వి కిరణ్‌కుమార్, నిఖిత కామటి వైద్యసేవలు అందించారు.

విద్యుత్ అదాలత్

తుళ్లూరు(రాయపూడి), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. బుధవారం రాయపూడిలలో సీఆర్డీఏ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో వినియోగదారులతో అదాలత్, అవగాహన సదస్సును నిర్వహించారు. అమరావతి, పెదకూరపాడు, తాడికొండ, తుళ్లూరు, మంగళగిరి మండలాల వినియో గదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ఈఈలు వెంకటేశ్వరావు, సంజీవరావు, హరిబాబు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి అనాగరికం

● ఎమ్మార్పీఎస్ నేత నాగరాజు

పెదనందిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పై జరిగిన దాడి అనాగరిక చర్యని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు ఆరోపించారు. దీనిపై నిరసనగా స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్, నాయకులు కూచినపూడి సత్యం, హృదయరాజు, దున్న సాంబయ్య, కారుమూరి అంకయ్య, వరగాని కైసర్ తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీవో

ఫిరంగిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతుల శుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భోజనం ముందు, తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవటం చాలా ముఖ్యమన్నారు. తహసీల్దార్ జే ప్రసాదరావు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించటం వల్ల అనారోగ్యాలు దరిచేరవని ఆయన తెలిపారు. వెలుగు ఏపీఎం నాగేశ్వర రావు డ్వాక్రా యానిమేటర్లకు చేతుల పరిశుభ్రతపై పాటించాల్సిన విధానాలను ఆయన చేసి చూపించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తాడికొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ బుధవారం లబ్ధిదారులకు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 మందికి రూ.26లక్షల 47 వేల 816లు మంజూరైనట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అమల్లో కూటమి ప్రభుత్వం సూపర్‌హిట్ అయ్యిందని ఆయన అన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల: దుగ్గిరాలలో అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక సాయం కోసం, వైద్యఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న బాధితులకు సీఎం సహాయనిధి నగదు చెక్కులను బుధవారం అందించారు. దుగ్గిరాలకు చెందిన సింబోతుల సాయికృష్ణకు రూ.44,100ల చెక్కు, ముస్లిం కాలనీకి చెందిన మహ్మద్ ఫాతిమాసమీకి రూ.20,684ల నగదు చెక్కును కూటమి నాయకుల చేతుల మీదుగా అందించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణ ప్రసాద్, టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్షవర్ధన్, కాకా బాబు, కోనంకి శంకర్, జున్నూఖాన్ బీజేపీ నాయకులు అడపా వెంకట్రావు, పసుపులేటి గణేశ్ యాదవ్ పాల్గొన్నారు.



దుగ్గిరాలలో సీఎం సహాయనిధి నగదు చెక్కును బాధితులకు అందిస్తున్న కేసంనేని శ్రీఅనిత తదితరులు

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా

● టీడీపీ మండల అధ్యక్షుడు రాంబాబు

పెదనందిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం ఏడుగురుకి 7.96లక్షల నగదు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి గూగుల్ ఏఐ హబ్ రావడం ఒక మైలురాయి అని..



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గూగుల్‌టెక్ సంస్థను ఇక్కడకు తీసుకువచ్చేందుకు కృషిచేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, తెలుగుమహిళా అధ్యక్షురాలు చిన్నం ఈశ్వరమ్మ, ఐటీడీపీ కార్యదర్శి దివ్వి నాగరాజు, నాయకులు నాగండ్ల శ్రీనివాసరావు, మాకినేని శ్రీకాంత్, తుమ్మల సీతారామయ్య, బొగ్గవరపు చంద్రశేఖర్, స్వయంపు కృష్ణప్రసాద్, నాగిశెట్టి శివన్నారాయణ, కొల్లా సురేష్, చెన్నుపాటి సురేంద్ర, నూతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు కోడూరి రాంబాబు

యువతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

వట్టిచెరుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్ కలాం భారత యువతకు స్ఫూర్తి ప్రదాత అని, ఆయన చూపిన మార్గంలో నడిస్తే ప్రతి విద్యార్థి జీవితంలో విజయం సాధించటంలో ఎలాంటి సందేహం లేదని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ ఎస్‌వీఆర్ రామ్ ప్రసాదు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే - 2025 వేడుకలు నిర్వహించారు. తొలుత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కలాం విగ్రహానికి రామ్‌ప్రసాదు, మలినేని పెరుమాళ్ళు కలిసి పూలమాల వేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాదు మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన సమాజానికి అందించిన విలువైన సేవలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జే అప్పారావు, డీన్‌లు, ప్రొఫెసర్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొనగా ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆహుతులను అలరించారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లోని ఫన్ ఇండియ హాక్‌థాన్‌ను కళాశాలకు చెందిన నాలుగో సంవత్సరం ఐటీ విద్యార్థులు విజయం సాధించి కళాశాల ఖ్యాతిని ఇనుమడింపచేశారని, ఆ బృందానికి కళాశాల తరుపున రూ.30 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని కళాశాల యాజమాన్యం ప్రకటించింది.




అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణలో పాల్గొన్న రోటరీ క్లబ్ గవర్నర్ ఎస్‌వీఆర్ రామ్ ప్రసాదు, కళాశాల చైర్మన్ పెరుమాళ్ళు

విద్యార్థులు నూతన ఆవిష్కరణలను సృష్టించాలి

తాడికొండ(మోతడక), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని నూతన ఆవిష్కరణలను సృష్టించాలని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఎక్స్ 2కె25ను రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో టెక్ ఫెస్ట్‌ను నిర్వహించారు. టెక్ ఫెస్ట్‌లకు 27 కళాశాలల నుంచి విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, వీ.వీ.సుబ్బారావు, పీ.బాలమురళీకృష్ణ, వీ.సాయి శ్రీనివాస్, శాంతిప్రియ, జీ.రామచంద్రరావు, కల్యాణ్‌కుమార్, రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

● అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం అని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. తాడికొండలోని శాఖా గ్రంథాలయంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి కొండా చిన్నపరెడ్డి, మల్లేశ్వరి, వరప్రసాద్ నివాళి అర్పించారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న వై.వీ.అంజనేయులు, నాగ శ్రీనివాసరావు

కలాం జీవితం ఆదర్శం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శమని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం టీడీపీ పట్టణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నేతలు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు వల్లభనేని వెంకట్రావు, దారా దాసు, చాంద్‌బాషా, మేకా పుల్లారెడ్డి, ఇట్టా భాస్కర్, అద్దంకి మురళి, శ్రీనివాసరావు, కె.మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల : క్షిపణి రంగంలో తిరుగులేని శక్తిగా భారతదేశాన్ని నిలబెట్టిన మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాలలోని ఆలీనగర్‌వద్ద గల అబ్దుల్‌కలాం విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, సభ్యులు గద్దె వాసు, వల్లూరు నరసిం హారావు తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు : చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయం, శ్రీనివాసా సీబీఎస్, పీఏఎస్ కళాశాలల్లో కలాం జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహ, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వాహకులు డి.శివనాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ జి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ



కృత్రిమ చేతుల పంపిణీ శిబిరంలో మాట్లాడుతున్న రంగారావు

మంగళగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో రెండో రోజైన బుధవారం కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. మంగళకరము పేరిట సాగుతున్న ఈ శిబిరంలో బుధవారం 32 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ పీడీజీ జాస్తి రంగారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేయాలన్న మంగళగిరి రోటరీ క్లబ్ నిర్ణయం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ చైర్ డీ.సాంబశివరావు, అవార్డు కమిటీ చైర్మన్ పీ.విష్ణుబాబు, రోటరీ క్లబ్ మంగళగిరి కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, కోశాధికారి కేవీఎస్ ప్రకాశరావు, ప్రాజెక్టు చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, పూర్వ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, రేవంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తాడేపల్లి విద్యార్థుల ఎంపిక

తాడేపల్లిటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 19 ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ అమరావతి వాలీబాల్ అకాడమి కొలనుకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుం టూరు జిల్లా, అండర్ 19 బీచ్ వాలీబాల్ జట్టును ఎంపిక చేయగా తాడేపల్లి కేవీఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.అజయ్, పి.స్నేహిత ఎంపికయ్యారని హెచ్ఎం తాతిరెడ్డి తెలిపారు. వీరు ఈనెల 28 నుంచి 30 వరకు బాపట్ల జిల్లా, సూర్యలంక బీచ్‌లో జరిగే 69వ ఎస్ఈఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడి కె.రజనినాయక్, సుజాత, శ్రీదేవి, మంజులవాణిలను హెచ్ఎం అభినందించారు. ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ పి.విమల్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.



రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అసభ్య ప్రవర్తన కేసులో రెండేళ్ల జైలు శిక్ష


మంగళగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల సాధారణ జైలుశిక్ష; రెండు వేల జరిమానా విధిస్తూ మంగళగిరి అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కమ్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ ఎం ప్రసన్నలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శివలీల తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటి వద్ద స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బోళ్ళ వెంకటరెడ్డి తొంగి చూస్తుండగా యువతి గమనించి ఇంటిలోకి వెళ్లగా నిందితుడైన వెంకటరెడ్డి ఆమె వెనకే ఇంట్లోకి వెళ్లి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బంది పెట్టగా సదరు యువతి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చే సరికి నిందితు డు అక్కడ నుండి పరారయ్యాడు. దీంతో సదరు యువతి మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 2019లో కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. కేసు ఇటీవల కోర్టులో విచారణకు రాగా వాదోపవాదాల అనంతరం నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, రెండు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రేపటి మహాధర్నాను జయప్రదం చేయాలి

మంగళగిరి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నగరంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం రవి పిలుపునిచ్చారు. డిమాండ్ల సాధన కోసం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన దీక్షలు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన రవి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడానికి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి యూ.దుర్గారావు, పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, చెంగయ్య, ఎం.బాలాజీ, వీ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

● చలపతి విద్యాసంస్థల సెక్రటరి వై.సుజిత్‌కుమార్



స్ట్రాటజీ డైరెక్టర్ చందనను సన్మానిస్తున్న చలపతి విద్యా సంస్థల సెక్రటరి వై.సుజిత్‌కుమార్

తాడికొండ(లాం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లాలని చలపతి విద్యాసంస్థల సెక్రటరి వై.సుజిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్ నిర్వహించారు. టెక్‌ఫెస్ట్‌లో ప్రామ్ట్ బ్యాటిల్, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్ తదితర పోటీల్లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ స్ట్రాటజీ డైరెక్టర్ ఎన్.చందన మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌లు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందటానికి ఎలా ఉపయోడపడుతాయో తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్, సీఎస్ఈ విభాగాధిపతి బాలాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కురగల్లులో ఇనుము దొంగల అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రూరల్ ఎస్ఐ వెంకట్

మంగళగిరి సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఆర్డీఏ పరిధిలోని కురగల్లు గ్రామంలో బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించి సుమారు రూ.2 లక్షల విలువైన సామగ్రి చోరీకి గురైందని సంస్థ మేనేజరు ఈ నెల 13వ తేదీన మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలను రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ బుధవారం వెల్లడించారు. విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన చల్లా జగదీష్, ఎం.గణేష్, పైడి దుర్గారావు, మరో ఇద్దరు టాటా మినీ ట్రక్కుతో గ్యాస్ సిలెండర్లు, కట్టర్లను సైతం తీసుకువెళ్లి ఇనుము చోరీకి పాల్పడినట్టు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, చోరీ సొత్తు రికవరీ చేసినట్టు చెప్పారు. నిందితులను బుధవారం న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● ఏసీడీపీవో విజయనిర్మల

పెదనందిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఏసీడీపీవో విజయనిర్మల అన్నారు. మండలంలోని నాగులపాడు, పెదనందిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా చిన్నారులకు అందించాలన్నారు. ఆమె వెంట సీడీపీవో విజయలక్ష్మీ ఉన్నారు.

ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టడమే లక్ష్యం

● గూగుల్‌తోపాటు డీలర్‌షిప్‌లూ ముఖ్యమే!

● టాటా హిటాచీ షోరూంను ప్రారంభించిన మంత్రి లోకేశ్



టాటా హిటాచీ డీలర్‌షిప్ షోరూంను ప్రారంభించి సభలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లోనూ ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరి జాతీయ రహదారి వెంబడి ఆత్మకూరు వద్ద లక్ష్మీ గ్రూపు ఆధ్వర్యంలో శ్రీధనలక్ష్మీ ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటు చేసిన టాటా హిటాచీ డీలర్‌షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని మంత్రి నారా లోకేశ్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శుక్ర, శనివారాలు వస్తే బుల్డోజర్లను ఎవరో ఒకరి ఇంటికి పంపించి, ఎంతగానో ఇబ్బంది పెట్టేవారని చెప్పారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మాత్రం ఎక్స్‌కవేటర్లను అభివృద్ధి పనుల కోసం, అమరావతి నిర్మాణం, రోడ్ల అభివృద్ధి కోసం మాత్రమే వినియోగిస్తున్నామని తెలిపారు. మంగళగిరి అమరావతికి ముఖద్వారంగా ఉందని, అమరావతిలో పనులు చేసే వారు మంగళగిరిలోనే నివాసం ఉంటున్నారని చెప్పారు. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకో సిస్టమ్ మంగళగిరిలోనే ఇప్పుడు సిద్ధంగా ఉందన్నారు. మంగళగిరిలో 2019 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ.. ఐదేళ్ల ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండి అన్నీ సమస్యలను తెలుసుకున్నానని, గత ప్రభుత్వం కంటే మెరుగైన సేవా కార్యక్రమాలను అమలు చేశానని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేయొద్దని చాలా మంది చెప్పారని, కానీ తాను ఇక్కడి నుంచి పోటీ చేస్తానని, 53 వేల మెజార్టీతో గెలిపించాలని కోరితే ప్రజలు ఏకంగా 91 వేల మెజార్టీతో గెలిపించారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో మంగళగిరి కోసం ఏ పని కోరినా సీఎం, డిప్యూటీ సీఎం, సహచర మంత్రులతో సహా కాదనే వారు లేరన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో వుంచుకుని యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులను జరిపిస్తున్నామని తెలిపారు. గూగుల్ ఎంత ముఖ్యమో డీలర్‌షిప్‌లు కూడా తనకు అంతే ముఖ్యమని పేర్కొన్నారు. లక్ష్మీ గ్రూపు ఎంతో నిబద్ధత గల సంస్థ అని, కంభంపాటి దాదాపు ఆరు వేల మందికి ఉద్యోగా లు కల్పించారని, ఆ సంస్థ మరింత వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎక్స్‌కవేటర్లు కొనుగోలు చేసిన పలువురు కస్టమర్లకు మంత్రి లోకేశ్ చేతుల మీదుగా తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గ్రూపు ఫౌండర్, చైర్మన్ కంభంపాటి రామమోహనరావు, టాటా హిటాచీ ఎండీ సందీప్ సింగ్, లక్ష్మీ గ్రూపు ఎండీ కే.జయరామ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ.భరత్ భూషణ్, ఆపరేషనల్ డైరెక్టర్ కే.వెంకట శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పాడి రైతుల సంక్షేమమే సంగం డెయిరీ ధ్యేయం



పాడి రైతులకు పశువుల దాణాను పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్లు

తాడికొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా సంగం డెయిరీ పనిచేస్తుందని డైరెక్టర్లు కంచర్ల శివరామయ్య తెలిపారు. బుధవారం తాడికొండ మండలం మోతడక, నిడుముక్కల గ్రామాల్లోని పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరామయ్య మాట్లాడుతూ నిడుముక్కల పాలకేంద్రం ద్వారా 83మందికి రైతులకు రూ.76,237లు, మోతడక పాలకేంద్రం ద్వారా 100 మంది రైతులకు రూ.86,638లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉత్తర కోస్తాలో 46ఎకరాల స్థలంలో డెయిరీని స్థాపించినట్లు తెలియజేశారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో ప్రభుత్వం 22.80 ఎకరాల భూమి సంగం డెయిరీకి ఇచ్చిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో తిరుపతి లడ్డు తయారీకి 5లక్షల లీటర్ల నెయ్యి 6 నెలలపాటు అందించుటకు సంగం డెయిరీ ముందుకు వచ్చిందన్నారు. డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం గేదెకు రూ.1200 ఇన్సూరెన్స్‌కు రైతులు రూ.400 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు సభ్యులు యడ్లపల్లి సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యులు కంచర్ల సాంబశివరావు, నిడుముక్కల పాలకేంద్రం అధ్యక్షుడు తలశిల శ్రీనివాసరావు, పొన్నెకల్లు సొసైటీ అధక్షుడు ఉప్పుటూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శంకరశెట్టికి సత్కారం



శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శంకరశెట్టి పిచ్చయ్యను సత్కరిస్తున్న కూటమి నేతలు

తాడేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆదేశాలతో శ్రీశైలం దేవాలయం ట్రస్టుబోర్డు సభ్యుడిగా నియమితులైన తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి చెందిన టీడీపీ నేత శంకరశెట్టి పిచ్చయ్యను కూటమి నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు శంకరశెట్టి పిచ్చయ్య, బోడేపూడి వెంకటసుబ్బారావు, కూటమి నేతలు జె.రత్తయ్య, జి.నగేష్, ఎస్.చంద్ర, జి.రాంబాబు, తిరుమలశెట్టి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలించిన ఎన్ఆర్ఎల్ఎం ఆర్పీ

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని పలు డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ నేషనల్ రిసోర్స్ పర్సన్ ముఖర్జీ పరిశీలించారు. గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందితో కలిసి మూడు రోజులపాటు తాడికొండ, దుగ్గిరాల, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని, ఫిరంగిపురం, చేబ్రోలు మండలాల్లోని పలు డ్వాక్రా గ్రూపులను, వారి ఉత్పత్తులను పరిశీలించారు. డీఆర్డీఏ, మిర్చియార్డు ఉద్యాన శాఖ, స్పైసెస్ బోర్డు, చార్టెడ్ అకౌంటెంట్స్, మిర్చి వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. ఈనెల 13 నుంచి 15 వరకూ జరిగిన ఈ పర్యటనలో గమనించిన అంశాలతో ఆయన ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి నివేదిక అందించనున్నారు. కార్యక్రమంలో ఏపీడీ కిరణ్‌కుమార్, డీపీఎం అశోక్‌కుమార్, సాంబశివరావు, చక్రవర్తి, వీరశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద

● 1,06,521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 93,900 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

తాడేపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి నీటి విడుదలతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి లక్షా 6 వేల 521 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 93 వేల 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 7431 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5009 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్ కాల్వకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్‌పర్సన్

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డులో బుధవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడం కారణంగా మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోందని, ఎక్కడికక్కడ అధికారులు నిత్యం సమీక్షించాలన్నారు. కాల్వల్లో సిల్ట్ వ్యర్థాలు వల్ల మురుగునీరు ముందుకుపోక వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నీరు నిలబడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ యేసు బాబు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భావితరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అత్తోటలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. ప్రాణవాయువులను అందిస్తున్న మొక్కలను పెంచడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగపుణ్యేశ్వరరావు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, నాయకులు కొఠారు అంజనేయులు, దాసరి నరసయ్య, వరికూటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

పొన్నూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిశుభ్ర చేతుల ద్వారా సంక్రమించే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి అవగాహన కల్పించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిరోజు చేతులు శుభ్రంగా సుబ్బుతో కడుక్కోవాలని సూచించారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరచుకోవాలని చిన్నారులకు కూడా సూచించాన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి మృతి చెందిన అనాథ మృతదేహానికి పట్టణంలోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు బుధవారం సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం తెనాలి-విజయవాడ రైలు మార్గంలోని పెదవడ్లపూడి రైల్వేస్టేషన్ వద్ద ఓ గుర్తు తెలియని యువకుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుని వివరాలను రైల్వే పోలీసులు విచారించగా బంధువర్గం లేదని, అనాథ అని తేలింది. తెనాలి జిల్లా వైద్యశాలలో భద్రపరిచిన ఆ మృతదేహాన్ని రైల్వే పోలీసుల విజ్ఞప్తి మేరకు సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు కలసి ఆ మృతదేహాన్ని బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సంప్రదాయపద్ధతిలో ఖననం చేశారు.

చేబ్రోలు హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

చేబ్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థుల సంక్షేమంపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. వసతి గృహంలో విద్యార్థుల సమస్యలను ఎప్పుడైనా స్థానిక నాయకులకు తెలియజేయవచ్చని, వారి అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ప్రసాద్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

● డాక్టర్ వంశీ

పొన్నూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని డాక్టర్ వంశీ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీపీఆర్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియో పల్మనరీ రిసిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. అత్యవసర సమయంలో సీపీఆర్ పద్ధతులను ఉపయోగించడంపై ఆరోగ్య నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఛాతీ కుదింపు, కృత్రిమ శ్వాస అందించే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే ప్రాథమిక చికిత్స అందించడంపై సూచనలు ఇచ్చారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, రెడ్ క్రాస్ సిబ్బంది వైద్యులు మున్సిపల్ వివిధ విభాగాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పొన్నూరు, తెనాలి టీడీపీ నాయకులు, తెనాలిలో ఎస్సీ, ఎస్టీ నాయకులు

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, తదితరులు

పొన్నూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. పొన్నూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు కలాం జీవిత విశేషాలను మననం చేసుకున్నారు. ఒక సాధారణ నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన ఉన్నత విద్యను కష్టపడి అభ్యసించి తదనంతరం శాస్త్రవేత్తగా ఎదిగారని కొనియాడారు. విశ్వవిద్యాలయాలలో పర్యటించి యువతను చైతన్యవంతులను చేసేలా ప్రసంగాలు ఇచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, పఠాన్ ఫిరోజ్ ఖాన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ బాబ్జి హుస్సేన్, జానీ బేగ్ తదితరులతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: దేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని, ఆయన్ను ఆదర్శంగా తీసుకొని యువత జీవితంలో ఎదగాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ప్రకాశం రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా ఎదిగారని, భారత అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి పదవిని సైతం చేపట్టారని అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడిపి ఆదర్శంగా నిలిచిన ఆయన భారత ప్రజలు మరిచిపోలేని వ్యక్తి అని కొనియాడారు. పార్టీ నాయకులు గోల్డ్ రహిమా, దుబాయ్‌బాబు, సుభాని, కాజా, అన్సారీ, మీరావలి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి ఆయన జన్మదినాన్ని ప్రపంచ విద్యా దినంగా పేర్కొనడం



అబ్దుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న ఏఎన్‌యూ సిబ్బంది, విద్యార్థులు

ముదావహమన్నారు. జొన్నాదుల మహేష్, సుభాని, జిలాని, రబ్బానీ, షంషుద్దీన్, దుర్గ, అశోకవర్ధన, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిరణ్‌కుమార్, జశ్వంత్, అశోక్, జిలాని, సిరి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో...

దివంగత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని వర్సిటీలో నిర్వహించారు. రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నారాకోడూరులో ...

చేబ్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని నారాకోడురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జన్మదినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఏ.ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఆర్.సుబ్బారావు, దుగ్గిరాలకు చెందిన పద్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భాస్కరరావు, పసుపులేటి గణేష్, వెంకట్రావు, పాఠశాల కమిటీ చైర్మన్ వెలగా గోపినాథ్, సభ్యులు భాస్కరరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో సుబ్బారావు మాట్లాడుతూ, అబ్దుల్ కలాం జీవితం ప్రతి యువకుడికి ఆదర్శమని అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి, విజేతలకు భాస్కర్‌రావు బహుమతులు అందజేశారు. 10వ తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్, విద్యార్థులందరికీ 700 పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తున్న దాత చుండూరు భాస్కర్‌రావుకు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎం.వెంకటేశ్వర్లు, పి.రాజ్యలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు అమలకుమారి, బి.రత్నప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో ఎంఈవో, భాస్కరరావు తదితరులు

బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్ల స్థలంలో పిచ్చిమొక్కల తొలగింపు

● వైసీపీ కౌన్సిలర్ ఫిర్యాదుతో కేంద్రమంత్రి చర్యలు

● స్థానికులు, వైసీపీ నాయకుల హర్షం

తెనాలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన తెనాలి మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ కఠారు రత్నకుమారి ఒక సమస్యను కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకురాగా 24గంటల్లో సమస్యకు పరిష్కారం చూపారు. ఇటీవల మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించడానికి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ వచ్చారు. ఆ సమయంలో వైసీపీ కౌన్సిలర్ కఠారు రత్నకుమారి తమ వార్డు పరిధిలో 10ఎకరాల ప్రదేశంలో విస్తరించి ఉన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల క్వార్టర్లు తొమ్మిదేళ్లుగా పాడుబడి ఉన్నాయని. అక్కడ పిచ్చి చెట్లు మొలిచి ఒక అడవిలా మారిందన్నారు. అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, స్థలం చుట్టూ ఉన్న 200కి పైగా కుటుంబాలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. దీనిపై మంత్రి పెమ్మసాని స్పందించి బీఎస్ఎన్ఎల్ అధికారులతో మాట్లాడారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న ఆ సమస్యకు 24గంటల్లోనే పరిష్కారం లభించింది. కేంద్రమంత్రి పెమ్మసానికి స్థానికులు, వైసీపీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.



పిచ్చి చెట్లతో నిండిపోయిన 11వ వార్డులోని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల క్వార్టర్స్ స్థలం, పిచ్చి చెట్లు కంప తొలగించాక స్థలం ఇలా

ప్రమాదరహితంగా బాణసంచా విక్రయాలు చేయాలి

● ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి



వీఎస్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలనాయుడు, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా బాణ సంచా విక్రయాలు చేయాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది కూడా దీపావళి బాణసంచా విక్రయాలకు పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ఏర్పాట్లు చేయడం జరిగిందని, బాణసంచా విక్రయించే వ్యాపారులు తాత్కాలిక లైసెన్స్ కోసం ఈ నెల 17 వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఫైర్, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో దుకాణాలకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి దుకాణానికి మధ్య తగినంత ఖాళీ ఉండాలని దుకాణదారులు అగ్ని నిరోధక వస్తువులను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చూడాలని, త్వరగా అగ్నికి కారణమయ్యే ఎలాంటి వస్తువులు ఆ ప్రాంతంలో లేకుండా పర్యవేక్షించాలన్నారు. బాణసంచా కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజల వాహనాలకు తగిన ప్రదేశం కేటాయించాలని, దుకాణాల వద్ద రద్దీగా ఉన్న సమయంలో కూడా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బాణసంచా కొనుగోలుకు వచ్చి ధూమపానం చేసే వారిని గుర్తించేలా దుకాణదారులకు బాధ్యత అప్పగించాలన్నారు. అనంతరం వీఎస్ఆర్ కళాశాలలో గ్రౌండ్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, కమిషనర్ అప్పలనాయుడు, టూ టౌన్ ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని బాజీ బాబా దర్గాలో అక్రమాలు

● దాతల షెడ్డును ఆక్రమించి టెంట్ హౌస్ నిర్వహణ

● ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఖాజావలి

పెదకాకాని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని బాజీ బాబా దర్గాలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ఒక దాత నిర్మించిన షెడ్లను కొందరు వ్యక్తులు ఆక్రమించి వాటిలో టెంట్ హౌస్ నిర్వహిస్తున్నారని, తక్షణమే ఖాళీ చేయాలన్నారు. హుండీల ఆదాయం బ్యాంకులకు చేరట్లేదని, కౌంటింగ్ సమయాల్లో స్థానిక వ్యక్తులను నియమించకుండా అధికారులతో లెక్కింపు జరిపించాలన్నారు. హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా నేరుగా బ్యాంకులో జమ చేయాలన్నారు. రాత్రి సమయాల్లో దర్గా ప్రాంతంలో కొందరు బయటి వ్యక్తులు మద్యం సేవించి, అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దర్గాలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌కు, ఇతర అన్ని శాఖల అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ముస్లిం హక్కుల పోరాట సమితి గుంటూరు జిల్లా కార్యదర్శి షేక్ షరీఫ్, నగర యువజన విభాగం అధ్యక్షుడు షేక్ షకీర్, నగర కార్యదర్శి షేక్‌యాసిన్ పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలించిన ఎన్ఆర్ఎల్ఎం ఆర్‌పీ

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని పలు డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్ నేషనల్ రిసోర్స్‌పర్సన్ ముఖర్జీ పరిశీలించారు. గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బందితో కలిసి మూడు రోజులపాటు తాడికొండ, దుగ్గిరాల, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని, ఫిరంగిపురం, చేబ్రోలు మండలాల్లోని పలు డ్వాక్రా గ్రూపులను, వారి ఉత్పత్తులను పరిశీలించారు. ప్రధానంగా మిర్చి ఆధారిత ఉపాధి కార్యకలాపాలు, పచ్చళ్ల తయారీ కేంద్రాలను పరిశీలించారు. డీఆర్డీఏ, మిర్చియార్డు ఉద్యానశాఖ, స్పైసెస్ బోర్డు, చార్టెడ్ అకౌంటెంట్స్, మిర్చివ్యాపారులు, మార్కెటింగ్‌శాఖ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. ఈ పర్యటనలో గమనించిన అంశాలతో ఆయన ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి నివేదిక అందించనున్నారు. కార్యక్రమంలో ఏపీడీ కిరణ్‌కుమార్, డీపీఎం అశోక్ కుమార్, సాంబశివరావు, చక్రవర్తి, వీరశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించొచ్చు

● డీఎల్‌పీవో స్వరూపరాణి



చెత్త సంపద తయారీ కేంద్రం గురించి అవగాహన కలిగిస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించవచ్చని డీఎల్‌పీవో స్వరూపరాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అత్తోటలో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు, పంచాయతీ సిబ్బందికి స్వచ్ఛ సంపద తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేయడం ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చవచ్చన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ, స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోడ్ల పక్కన చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

● గుంటూరు ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులు వాడకం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని గుంటూరు ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగిలో జీవన ఎరువుల వాడకంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రైతులు రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడటం వల్ల నేల నిస్సారంగా మారుతుందన్నారు. జీవన ఎరువులు భూసారాన్ని పెంచుతాయని, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో జీవన ఎరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. వీటి వాడకంతో కొంతమేర సాగుఖర్చు తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తయారుచేస్తున్న జీవన ఎరువులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జీవన ఎరువులపై అవగాహన కలిగిస్తున్న ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్

హెల్త్ సెంటర్లలో కమిషనర్ పరిశీలన



అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లను మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు బుధవారం సందర్శించారు. 28వ వార్డులోని ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అక్కడున్న పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఎదుట సరైన ఫ్లోరింగ్ లేకపోవడం, గోడల వెంట చెమ్మదిగి పాచి పట్టడం వంటి పలు లోపాలను గుర్తించి ఇంజనీరింగ్ అధికారులను వాటిని చక్కదిద్దాలని ఆదేశించారు. 25వ వార్డులోని గార్బేజ్ బదిలీ కేంద్రాన్ని సందర్శించి సరైన నిర్వహణ చేయాలని సూచించారు. వార్డు ఎమినిటీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి అంశాన్ని పరిశీలిస్తూ ఉండాలని, లోపాలను సరి చేయాలని, అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. 9వ డివిజన్‌లోని క్లస్టర్ కార్యాలయాన్ని సందర్శించి మస్టర్‌కు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది ఉన్నది లేనిదీ తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలో ఎక్కడా ఎలాంటి పారిశుధ్య సమస్య తలెత్తకూడదని, వ్యర్థాల సేకరణ చేయడం లేదనే విమర్శలు రాకూడదన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గట్లపై కూరగాయల మొక్కలతో అధిక ఆదాయం

● ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి



పొలం గట్లపై కూరగాయల మొక్కల పెంపుపై రైతుకు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

కొల్లిపర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరి పొలాల గట్లపై కూరగాయల మొక్కలను పెంచుకుంటే అధిక ఆదాయాన్ని పొందొచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చివలూరు, సిరిపురం, అత్తోట, దావులూరు, కొల్లిపర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాధికారులు వరి పొలాల్లో పర్యటించి గట్లపై కూరగాయల మొక్కల పెంపకం గురించి రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ, జీవవైవిధ్య పంటల వల్ల చీడపీడల నివారణ కలుగుతుందన్నారు. పొలం గట్లపై అన్ని రకాల కూరగాయల పంటలను పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీనియర్ టెక్నికల్ లీడ్ గోపిచంద్, రైతులు పాల్గొన్నారు.



అపర కర్మశాలకు కుర్చీలు, టేబుళ్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

సామాజిక సేవను బాధ్యతగా భావిస్తున్నాం

● రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలను రోటరీ క్లబ్ బాధ్యతగా భావిస్తోందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్ చెప్పారు. రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం అపర కర్మశాలకు 60 కుర్చీలు, డైనింగ్ టేబుళ్లు అందజేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా రోటరీ క్లబ్‌లు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్ మాట్లాడుతూ, క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ వృక్ష సంపద విలువను గుర్తించాలని, మొక్కలు నాటి పెంచాలని కోరారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, హరిప్రసాద్, మురళీకృష్ణ, కర్మశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో వివా విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న వివా ది స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్‌కు చెందిన 11వ తరగతి విద్యార్థి చుక్కా జోయల్ ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 69వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచాడని స్కూల్ చెర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. సెప్టెంబరు 22 నుంచి 25 వరకూ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలలో ప్రతిభ కనబరిచి 69వ జాతీయ స్కూల్ గేమ్స్‌కు రాష్ట్ర జట్టు తరఫున ఎంపికయ్యాడని తెలిపారు. వివా ది స్కూల్‌లో విద్యార్థులకు ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలలో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణను అందిస్తున్నామని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో వివా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాణించడం సంతోషం గా ఉందన్నారు. అనంతరం చు క్కా జోయల్‌ను వివా వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరా వు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, పీఈటీలు అభినందించారు.